# అ భి మ న్యు డు

"మీ అబ్బాయి కేమని నామకరణం చేయాలనుకుంటున్నారూ?" మిత్రులు సవ్యసాచిని అడిగారు. ఆయన రచయిత. మూడు ప్రాంతీయ భాషల్లో రచనలు చేస్తూ వుంటాడు. భాషాంతరీకరణం కావాలంటే చేసిపెడతాడు. డబ్బు చేరంగానే అజ్ఞానం చేరుతుందని కావాల్సినంతే సంపాయిస్తాడు. బాంకు బాలెన్సు లేదు. వేడుకకి టెంపొరరీ వుద్యోగాలు, ప్రైవేటు సంస్థల్లో చేస్తాడు. సంతానం లేదని భార్య సుభద్రమ వాపోతే,

"ప్రాణం హాయిగా వున్నది. ఆ పుట్టినబిడ్డ ఆరోగ్యంగా అందంగా పెరుగుతూ కనిపించాలి, తెలివిగలవాడూ, మంచివాడూ కావాలి, ప్రయోజకులు కావాలి. అలా కాకపోతే పరాయి బిడ్డల్ని చూసి అసూయ కలుగుతుంది. ఆబాధలు మనకులేవు. వేరే యేదైనా వ్యాపకం కల్పించుకో, లేదా బంధువుల పిల్లల్ని తెచ్చి పెంచుకో." అని వూరడించాడు.

"వాళ్ళను మాత్రం పెంచద్దూ, పెళ్ళిచేయద్దూ, చదివించద్దూ. వాళ్లూ అణకువగా వుంటారో వుండరో?" అన్నది.

"తెలిసే బాధ పడుతున్నావు." అన్నాడు.

సుబద్రమ్మ మొగుడికి తెలియకుండా, నోములూ, ప్రదక్షిణలూ, వుపవాసాలూ చేసింది.

'నీకూ చాదస్తం పట్టుకున్నది. చిక్కిశల్య మవుతున్నావు, శిశు విహార్‌నించి వోబిడ్డని తెచ్చి పెంచుకో, ఆ పిచ్చి వదుల్తుంది. నీకు యేదైనా జబ్బు చేసిందంటె చాలా వదుల్తుంది. వుపవాసాలు చేయకు, కడుపునిండా తిని, కంటినిండా నిద్రబోతే కాశీబోయినంత పుణ్యమొస్తుందిట, అపని చేయి మంచిది.' అన్నాడు.

సుభద్రమ్మ కోరిక నెరవేరింది, తీసుకోవలసిన భద్రత లన్నీ తీసుకున్నా సీజరియన్ ఆపరేషన్ జరిగి కొడుకును చూసుకున్నది. బారసాల చేసుకుందామని అడిగింది. జాలిగా చూసి 'సరే' అన్నాడు.

ఫ్రెండ్స్ బాగా ప్రోత్సాహమిచ్చి సహాయం చేశారు. పురోహితుడిని తెచ్చారు, ఆయన అడిగాడు.

'జన్మనక్షత్రాన్ని బట్టి అయితే 'చూచే బోలా' అశ్వని 'వావీ వేవో' భరణీ అలాటి అక్షరాలతో పేరు మొదతాతుంది, నేచెప్పనా' అన్నాడు.

హాలులో వున్న ఆహూతులందరి వేపు చూశాడు. సవ్య సాచి, భార్యనూ చూశాడు, సుభద్రమ్మేమో వచ్చనితాడు మొలతాడు కట్టి తాయెత్తు కట్టింది, పిల్లవాడిని చూసి మురిసి పోతూ భర్తవంక చూసింది.

"మీయిష్టం" అన్నది.

ఒడిలో పళ్ళెం దానిలో నిండా బియ్యం పరిచి వున్నాయి చేతులో బంగారు వుంగరం, బియ్యంమీద అందమైన అక్షరాలు రాశాడాయన వుంగరంతో. 'అభిమన్యుడు'

స్నేహితులు చూసి నవ్వారు.

అంటే వ్యూహంలోకి చొచ్చుకుపోతాడని సూచిస్తున్నారు

విందు ముగిసింది, అంతా వెళ్ళిపోయినారు.

## 2

అభిమన్యుడారోగ్యంగా బలంగా పెరిగి తల్లికి ఆనందం కలిగించాడు, తండ్రి అక్షరాభ్యాసం తానే చేశాడు, అభిమన్యుడు ఆటలపోటీల్లో నెగ్గి ప్రైజులు తెచ్చి తండ్రికిచ్చాడు.

ఎలిమెంటరీ స్కూల్లోనే తనక్లాసుకు లీడరై, మానీటరై తోటి విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పగలవాడైనా డభిమన్యుడు.

తల్లి బాగా ముద్దు చేసేది.

"నువ్వు వాడిని పాడుచేయకు, రాటు తేలాలి ప్రపంచ జ్ఞానంలేకుండా చేస్తున్నావు." అన్నాడు తండ్రి.

సుభద్రమ్మ రోజూ చావగొట్టమంటారా, నాకు చేతులు రావు, మీరే చేయండావని, అని వెళ్ళిపోయింది.

హైస్కూల్ చదువులో గురువుల మెప్పు పొందా డాభిమన్యుడు, పరీక్షలు వ్రాసి. స్కాలర్‌షిప్ తెచ్చుకున్నాడు, తండ్రి తృప్తి పడ్డాడు.

"మీ అబ్బాయి యూనివర్శిటీ ఫస్టువస్తాడండీ, ఇంతవర కూ తప్పటం అనేదే జరగలేదు" అని ఫ్రెండ్సు అంటే,

"ఆఁ, యేదో చదువుతున్నాడు. చదువుకన్న ముఖ్యం లోకజ్ఞానం, క్లెవర్ అనిపించుకునే కన్న వైజ్ అనిపించుకోటం కష్టం." అన్నాడు తండ్రి.

కాలేజీ చదువు అవుతుండగానే రచనలు సాగించాడు అభి మన్యుడు. కాలేజీ పత్రికకు సంపాదకుడైనాడు, కాలేజీ ప్రిన్సి పాల్ పూర్ణయ్యగారు, ఉభయభాషాప్రవీణ.

అభిమన్యుడికి తండ్రి పోలిక వచ్చినట్టున్నాదే, అనుకు న్నాడు. తనను కన్సల్టుచేస్తే ఒరవడి వచ్చేట్టు మంచి తెలుగు వాడుకభాషా, అనాటి పరిస్థితులు, సాంఘికాచారాలు, రాజకీయా లూ, పారడీలు వ్రాయటం నేర్పాడు, శిష్యుడంటే అభిమానం.

యెమ్మేలో చేరగానే అభిమన్యుడు తన కథానికలు పత్రి కలకు పంప మొదలెట్టాడు, గురువుకు చూసే, మెచ్చితేనే పోస్టు చేశాడు. కొన్ని పడినై, కొన్ని పడలేదు.

అభిమన్యుడిదృష్టి పోటీ నిబంధనలమీద పడింది, అవన్నీ సులభంగా అనుసరించ వీలున్నది అని తోచింది. ప్రైజు లు వచ్చిన రచనలు చదివాడు, స్త్రీల రచనలూ నిదానంగా చదివాడు.

"ఇది మౌలికమే! చిత్రమే, దీన్లో పాయింట్ ఇంగ్లీష్ నావెల్ లోనిది." అన్నాడు మిత్రుడితో.

తప్పు పట్టేకన్న నువ్వు మౌలిక రచన పంపితే బాగుంటుందేమో! అన్నాడు ఫ్రెండ్.

ఆరాటం ఆపుకోలేక నిబంధనల ననుసరిస్తూ కథానిక వ్రాసి పోటీకి పంపాడు, ఉగాది వచ్చింది వెళ్లింది. "గాజులూ పూసలూ" అనేకథానికకు ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది.

యెమ్మే ఫస్టొచ్చినా ఫస్టురాంక్ వచ్చినా అభిమన్యుడికి ఆనందం కలగలేదు. ప్రైజుమీదే వున్నది మనసు, ఉద్యోగం వచ్చేదాకా రిసెర్చ్ చేయదలచాడు, పూర్ణయ్యగారే గైడ్.

'నవలా పరిణామము, నవల అనే పేరు యెలా వచ్చింది' అదీ టైటిల్, కేవలం ఆచార్య బిరుదుకోసమే కాక, సాహిత్యం మీది గౌరవంతోనే చాలా రిసెర్చ్ చేశాడు అభిమన్యుడు. ఇంగ్లీష్, తెలుగు హిందీ భాషల్లో, క్లాసికల్, సోషల్, క్రైమ్ అన్ని నవలలు జీపోసనపట్టాడు. పరభాషలోంచి, మాతృభాషలోకి అనువదించబడిన వాటినీ, అనుసరించబడిన నవలలనూ యిష్టంతో చదివాడు అభిమన్యుడు ప్రూఫు తానే దిద్దుకున్నాడు. ఒక్కపూటలో ఒక్కతప్పు లేకుండా సిద్ధాంత గ్రంధాన్ని తయారు చేశాడు. ముత్యాల కోవలాగా వుంటాయి అభిమన్యుని అక్షరాలు, గురువు ఆశీర్వదించగా మంచి ముహూర్తం వున్న రోజున, థీసిస్ విశ్వవిద్యాలయంలోకి నడిచింది.

దేనికెదురు చూస్తున్నాడో అభిమన్యుడు అది రాలేదుగానీ, డాక్టరేట్ వచ్చేసింది. సంతార్పణ చేస్తేనన్నా దేవుడు మెచ్చు తాడేమోననే ఆశతో అభిమన్యుడు మంచి హోటల్లో డిన్న రిచ్చాడు.

నవలారచనా మానలేక పోయాడు. ధారావాహిక నవల లూ, ప్రైజులుకొట్టిన నవలలూ చదువుతూనే వున్నాడు. పోటీకి పోస్టు చేస్తూనే వున్నాడు. తపాలాబిళ్ళల జతపరుస్తాడు. రెడ్ పెన్సిల్‌తో నంబర్ వేయబడి తన కథానికా, నవలా తిరిగివస్తా యించక్కా.

ఆరాటం పెరుగుతున్నదేగాని తరగటం లేదు తండ్రి నడిగాడు.

'నాన్నగారూ! ఈ నవల మౌలిక మేనంటారా? ఇది తెలుగు దేశాన్ని, దాని సాంఘిక పరిస్థితుల్నీ అద్దంపట్టి చూపు తున్నదంటారా? దీనికి ప్రైజెలా వచ్చింది?'

తండ్రి కొడుకువంక సాలోచనగా చూశాడు.

"నీమాటలు వింటే, నిన్ను చూస్తే యెవరైనా నీకు పదో యేడు లేదా మహా వుంటే పదహారో యెడను కుంటారు" అన్నా డాయన వ్యంగ్యంగా.

'నేను సీరియస్‌గా అడుగుతుంటే మీరు హాస్య మాడుతు న్నారు.' అన్నాడు కొడుకు.

వాళ్ళు రాసేదేదో అందరికీ అర్థమయేట్టు వాస్తున్నారు. నువేమో మరీ గాఢంగా రచనలు చేస్తున్నావు. భాష గూడా హైస్టాండర్డ్ అన్నాడాయన.

అభిమన్యుడికి తండ్రి సరిగా చెపుతున్నట్టు తోచలేదు. నవ్వుతున్నాడు తండ్రి ఈ ముడివిప్పాలి అనుకున్నాడు. కాలేజీ వేళైందని వెళ్ళిపోయాడు.

సాయంకాలం పార్కులో వచ్చి గడ్డిమీద కూచుని వున్నాడు, పరాకుగా వున్నాడు.

స్నేహితుడు మోహనరావు వచ్చాడు. పక్కన కూలబడ్డాడు. "అభిమాన్యూ! మరీ పరాకుగా వుంటున్నావు, యేమిటి బాధ? నేనుగూడా నీ బాధ పంచుకుంటా" అని కదిలించాడు.

నీరసంగా విచారంగా చూచాడభిమన్యుడు.

"బాధేమరి, ప్రైజెందుకు రాదూ తెలియటంలా గురువు గార్ని అడగనా అని చూస్తున్నా, పోనీ నీకు తెలిస్తే చెప్పు. నిబంధనలన్నీ పాటించి రచన చేశాగదా మెచ్చి మేకతో లు కప్పరేం?" అన్నాడు నవ్వుతూ.

"నాకూ తెలియదు సోదరా, నేను ఆడిషన్‌కి వెళ్ళి తప్పి వస్తూవుంటా, గురువేమో 'భేష్, బేష్' అని తలూపుతూనే వుంటాడు. నా సహాధ్యాయి కటక్ రేడియోస్టేషన్లో రేడియో ఆర్టిస్టయి

నాడు. వాడికి ఒక డజన్ వర్ణాలన్నా రావు. ఇంకా కృతులు నేరుస్తున్నాడు. గురువునే అడిగా, 'వాడి గొంతు మైక్కిఫిట్టయిందా గురువుగారూ? వాడు సాలేరి వర్ణం నేర్పమని అడుగుతున్నాడే, అంత చిన్నవర్ణం రానివాడు యెలా సెలెక్టయినాడు? యెలా ప్రోగ్రాములు యిస్తున్నాడు? అతను ఆడిషన్‌కి వెళ్ళినప్పుడూ ఎలక్ట్రికల్ రికార్డింగ్ జరిగింది. వాడూ యింకా శిష్యరికం చేస్తూనే వున్నాడు. మీరు కరెక్టుచేస్తునే వున్నారు.' దానికి గురువు జవాబు వాళ్ళొచ్చిన టైమ్‌లో వాళ్ళకు నచ్చేట్టు పాడాడు అన్నమాట. అప్పుడు వాడి గొంతు బాగా వుండి వుండాలి. నీకు జలుబుచేసి పాడైవుండాలి. గురువు నవ్వుతుంటే నేనూ నవ్వాను సోదరా!

అభిమన్యుడి తండ్రి ఆంధ్రమహా సభలు న్యూయార్క్‌లో జరుగుతుంటే స్నేహితులతో వెళ్ళాడు.

అభిమన్యుడు గురువుగార్ని చూడబోయినాడు.

గురువు వడక్కుర్చీలో వాలివున్నాడు. పిల్లపెళ్ళికుదరాలి కొడుకు పెళ్ళి ఆపాల్సివస్తున్నది. తను ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న కాలేజీలోనే లెక్చరర్ హోదాలోకి వచ్చిన తన శిష్యుడు రావటం చూశాడు.

అభిమన్యుడు లాల్చీపై జామా, అకు చెప్పులతో నిలబడి నమస్కారం చేశాడు. అరుగుకింది వరసగా మెట్టతామర మొక్కలు, యెరుపు, పసుపు రంగుల పూలు పెద్దవి పూసినై.

సాయంకాలం చల్లని గాలి వీస్తున్నది. అతని మొహాన విచార రేఖ గురువు కంటబడింది.

"ఆ బల్లమీద కూచో అభిమన్యూ. అలా వున్నావేం. డాక్టరేట్ వచ్చింది, జాబ్ వచ్చింది, ఇంకా యేంకావాలి? పెళ్ళి కావాలా?" అని సరసమాడాడు.

అభిమన్యు చెప్పులు వదిలివచ్చి కూచున్నాడు.

"పెళ్ళి కాదండి. మీరు మెచ్చిన రచలు పంపినా పోటీ లో గెలవలేక పోతున్నాయి ప్రైజూ రాదు" అన్నాడు తలొం చుకుని.

'అది నాచేతిలో లేదోయ్!' అన్నాడు గురువు ఆలోచినా తంగా. అన్నాక శిష్యుడిని చూశాడు, నవ్వువచ్చి నాలిక్కరు చుకున్నాడు. యెందుకన్నానా అని చూశాడు శిష్యుని వంక.

అభిమన్యుని మొహాన ఆశ్చర్యం, నోరు తెరిచాడు, తెప్ప రిల్లి అన్నాడు.

'నేను మద్రాసు వెళ్దామను కుంటున్నాను గురువుగారూ! శలవులేగా, మా నాన్నా వూళ్లోలేరు. మా అమ్మ అమ్మమ్మకు బాగా లేదని వెళ్లింది.'

'వెళ్లి యేమి చేస్తావు?' అనడిగాడు గురువు.

'పత్రికా ఆపీస్‌కి వెళ్లి మౌలిక రచనకు ప్రైజెందుకురాదో తెలుసుకుని వస్తా, మరీ దుగ్ధగా వున్నది', అన్నాడు.

"బాగొంది, పెళ్లిరా. నేను రికమండిషన్ లెటరిస్తా. నువ్వు చూడబోయేాది నా మిత్రుడినే, అడ్రసూ వ్రాస్తా కవర్ మీద. మద్రాసంటే మహా పట్నం, మోషపోతా వేమో, మారువడతా వేమోనని యివ్వదలిచా, వాళ్ళింట్లో బసయిస్తారు. నేను వెళ్ళి వచ్చి వారమే అయింది. సంబంధమున్నదంటే వెళ్ళి వాళ్లింట్లో నే బసచేశా. కూచో వస్తా" అంటూ లేచాడాయన. పదిహేను నిమిషాల కల్లా అంకించిన, అడ్రస్ రాసిన కవరు తెచ్చి అభిమన్యుడి కందించి,

'క్షేమాన బోయి, లాభాన రా' అని దీవించి నవ్వించి మరీ పంపాడు.

## 3

దోణప్ప తండ్రి మద్రాసే, బట్టలు వ్యాపారం చేస్తూ తెలుగు వారపత్రిక యేజన్సీ తీసుకున్నాడు, ఫ్రెండ్స్ ప్రోత్సాహి స్తే పబ్లిషర్సుతో భాగం పెట్టుకున్నాడు, వ్యాపార రహస్యాలు తెలుసుకున్నాడు. దండిగా డబ్బు గడించాడు. ఒక్కడే సంతానం, వాడికి వ్యాపార రహస్యాలు నేర్పుతూ, చదివించి కన్ను మూశాడు. దోణప్పకి వాళ్లమ్మ మంచి సంబంధం చూసి పెళ్లి చేసింది. దోణప్ప తండ్రిని మించిన కొడుకైనాడు. స్వంత పత్రిక 'పద్మ' స్టార్ చేసి, వారపత్రికలో, కథానికల పోటీలు, నవలా రచన పోటీలు ఉగాదికి పెట్టాడు. నవలామణి మాలిక అని నవలలు పబ్లిష్ చేస్తున్నాడు.

దోణప్ప ఒడ్డూ పొడుగూ, దబ్బపండు రంగూ, పెద్దకళ్లూ బంగారు ఫ్రేమున్న కళ్లజోడూ, సిల్కు లాల్చీ ఖద్దరు ధోవతీ, పట్టంచుల వుత్తరీయం వేస్తాడు. తనపత్రికా కార్యాలయంలో కూచుంటే నవ్వు మొహంతో సూదంటు రాయిలాగా ఆకర్షిస్తాడు. నోషలిస్టు, పనిలేనివాళ్లూ, క్లిష్ట సమస్యలో యిరుకున్న వాళ్లూ వస్తారు ఆఫీసుకి. సామ్యవాది దోణప్ప చేతనైన సాయం చేస్తాడు.

ఆఫీసులో కుర్చీలలో వున్న పెద్దమనుషుల రొద వింటు న్నాడు దోణప్ప. ఆఫీసులోకి అడుగుపెట్టిన అభిమన్యుడిని చూచాడు.

"అలా కూచోండి" అని కుర్చీ చూపాడు. అభిమన్యుడూ హించిన పత్రికాధిపతి పేరు తగు మాత్రంగా వున్న గదిలో, మాసిన దుస్తులతో వున్న సంపాదకు, సాహిత్యం, కార్టూన్లు తిర గేస్తూ వుంటాడు, తనవంటి యువక రచయితలు, కార్టూనిస్టూ వచ్చి నిలబడి యేదో అడుగుతూ వుంటారని వూహించాడు.

తీరా చూస్తే ఆ, ఆఫీసూ, అతిరథ మహారథులకు సలహా లిస్తున్న గురువులాగా వున్నాడీ పత్రికాధిపతి, జంకు కలిగింది. సమయానికి తనకు తన గురువుయిచ్చిన వుత్తరం గుర్తొచ్చింది నమస్కారం చేసి దోణప్పకు అది అందించాడు.

హాలులోని వారు వెళ్లాక దోణప్ప వుత్తరం తీశాడు.

"ప్రియమిత్రమా!

నీ ఒక్కగా నొక్క కూతురుకీ, సాంప్రాదాయం గల సంబంధముంటే చూడమని లోగడ చెప్పి వున్నావు. చూ స్తూ నే వున్నాను.

ఈ పుత్తరం తెచ్చిన అభిమన్యుడు, నా శిష్యుడు, మా కాలేజీలో లెక్చరరు. యెంత యోగ్యుడో యెంత తెలివిగలవాడో అంత అమాయకుడు.

ఇతని కథానికలు మీ పత్రికలో అడపాదడపా పడినాయి. అనుభవం మీద గ్రహించాల్సిన విషయాన్ని ముఖాముఖంగా తెలుసుకోవాలని మీ ఆఫీసుకొచ్చాడంటే, గ్రహింగల ననుకుంటాను. ఇతినిని నొప్పించకుండా, బుద్ధిమళ్లించ గలిగితే గొప్ప వుపకారం చేసినట్టే. తండ్రికొక్కడే కొడుకు. మా కాలేజీ లెక్చరరుకి ఆతిథ్యమివ్వటానికి, సంకోచించ వనుకుంటాను, "పద్మ" నిత్యనూతనంగా వెలువడుతున్న దనుకుంటాను. సర్క్యులేషన్ అభివృద్ధి జెందాలని ఆశిస్తాను.

నీ శ్రేయోభిలాషి
పూర్ణయ్య."

దోణప్పకా లేఖ, 'పిల్లవాడు నీకు నచ్చితే నిరాక్షేపణీయంగా పిల్లనిచ్చుకో' అన్నట్టు ధ్వనించింది. తలెత్తి చూశాడు. అభిమన్యుడు నవ్వు మొహంతో కన్పించాడు. పున్నమి చంద్రుని చూసిన సముద్రునిలాగా అయినాడు దోణప్ప.

ఉత్తరం మడిచి జేబులో వేసుకుని,

"యెక్కడ దిగారూ?" అనడిగాడు.

'యెవరెస్ట్ హోటల్లోనండీ' అన్నాభిమన్యుడు.

"మా యింటికి పోదాం రండి. మీక్కావాల్సిన విషయాలు తెలుసు కోవచ్చు. ఇక్కడ బావుండదు." అని లేచాడు దోణప్ప.

# 4

వర్ణచిత్రాలున్న తివాసీ నేలమీద పరిచివున్నది. దాని మీద, కొత్తరకం ఫర్నిచర్, మూలగా గోడకమర్చి వున్న అరలో రంగు ఫోనూ, వాకిళ్ళకి సిల్కు తెరలూ, పక్కన గోడల కమర్చిన ఫ్లవర్ గాజుల్లో ప్లాస్టిక్ పూలూ, గోడలకు దేశనాయకుల చిత్రాలూ, సీలింగ్ ఫానూ, గోడకానివున్న అద్దాల బీరువాలో మంచి బొమ్మలూ, షెల్ఫులో పుస్తకాలూ, వున్న హాలులో అభిమన్యుడిని కూచోబెట్టి దోణప్ప లోపలికెళ్లాడు.

కూతురును వెంటబెట్టుకొచ్చాడు. ఆపిల్ల డ్రింకూ బిస్కట్లూ వున్న ట్రేతో వచ్చి, గుండ్రని బల్లమీదుంచింది పక్కగా వున్న సోఫాలో కూచుని నమస్కారం చేసింది.

'మా అమ్మాయి మోహిని, గుల్బర్గాలో మెడిసిన్ చదువు వున్నది.' కూతుర్ని పరిచయం చేసి దోణప్ప అభిమన్యుడి కెదురుగా వేసున్న సోఫాలో ఆసీనుడైనాడు.

'మనింటికి పూర్ణయ్యగారు వస్తూవుంటారే, వారి కాలేజీలో వీరు లెక్చరర్, రచనలు చేస్తుతుంటారు' కూతురికి పరిచయం చేశాడు.

మోహిని యెర్రగా బొద్దుగా వున్నది. ముదురు నీలం రంగు జార్జెట్‌చీరా, వాయిల్ జాకట్టూ కట్టింది. స్నానం చేసిన తల, జడ వేయక వదిలింది తలదగ్గరగా రంగుతాడు కట్టింది. జుట్టు మధ్యా, చివరా రాళ్ళ పిన్నులు పెట్టింది. మొహాన యెర్రని తిలకం. రంగు వేసినట్టున్న పెదవులు, రంగు వేసిన గోళ్లూ, మెళ్లో సన్నని గొలుసుకి లాకెట్టు, చెవులకి మెరిసే రింగులూ, యెడమ చేతికి వాచీ, కుడిచేతికి తెల్లరాళ్ళ గాజూ, వేలికి నీలం రాతివుంగరం, చెవిపక్కగా పన్నుకి యెర్రగులాబీ పెట్టుకున్నది.

అభిమన్యుడు అడిగాడు. "అంత దూరానెందుకున్నది?" మోహిని ముత్యాల పలువరస కనబడేట్టు నవ్వింది.

"ఇక్కడ సీటు రాలా" అన్నాడు దోణప్ప. సీటిచ్చి "పద్మ" లో ఓ కథానిక వేయించమంటే వేయించనా అని ఆయన భావం.

మోహిని మూగపిల్లేమో తేల్చాలన్నట్టు అభిమన్యుడా పిల్లనే చూస్తూ అడిగాడు.

"మెడిసిన్ యెన్నో సంవత్సరం చదువు తున్నారూ?" ఆపిల్ల మళ్లా చిరునవ్వు చిందించింది.

కూతురు వంక గర్వంగా చూస్తు దోణప్పే విశదీకరించాడు.

'హోమ్ సైన్సెస్‌తో యిక్కడ బియస్సీ ఫైనల్స్ కొచ్చింది మా అమ్మాయి. నెలకిందట గుల్‌బర్గాలో సీటొచ్చిం దని తెలియజేస్తే అక్కడిని పంపించేశా.'

అభిమన్యుడు తన వేపే చూస్తు వుండటంవల్ల యిబ్బంది పడిన మోహిని, వంటై దేమో కనుక్కొస్తా. అంటూ లేచివెళ్లింది.

డ్రింక్‌గ్లాసు అభిమన్యుడి కందించాడు దోణప్ప. తమ పత్రిక ఆర్థిక దుస్థితి విలువైన అడ్వర్‌టైజుమెంట్లు లేక పోవ టం యే కరువు పెట్టాడు.

అటువంటి దుస్థితిలో గూడా "పద్మ" ప్రైజులివ్వటం మానలేదు. గుల్‌బర్గా మెడికల్ కాలేజీ వాళ్ళు నా ఔదార్యం విని, తమ వైద్య సంస్థ యింకా బాగా నిలదొక్కుకోలేదని, నా వంటివారు ఆదుకుని, వైద్యవిద్యను ప్రోత్సహించాలని వ్రాశారు యెంత? అని అడక్కుండా వారడిగినంతా యాభై వేలు డ్రాఫ్టు యిచ్చాను.

హోమ్‌సైన్సెస్ చదువుతున్న మోహిని మెడిసిన్ ఫాలో కావటం గురించి అభిమన్యుడాలోచిస్తున్నాడు. పత్రిక దుస్థితి తో అతనికేం అవసరం కనబడలా.

అనాట, మీ ఫార్మకాలజీ, ఫిజియాలజీ, డెర్మటాలజీ గైన

కాలజీ హోమ్ సైన్సెస్‌లాగా సులభంగా వుంటాయా? ! అని ఆలోచిస్తూ, తెప్పల్లి అడిగాడు.

'బాగా వున్నాయనీ, ఒరిజినలే ననీ మీరే అంటిరి గదా నా కథానిక బహుమతీ తెచ్చుకోలేక పోయిందేం?'

"ఇదా నువ్వు తెలిసికోవాలని వచ్చింది?" అన్నట్టు చూశాడు దోణప్ప. నవ్వు మొహం.

"అని నాచేతులో వస్తే అట్లాగే యిచ్చివుండును, బహుమతి నిర్ణేతలుంటారు." అంటూ నవ్వి,

'అసలు నాకు తెలుగు సాహిత్యంతో యేపాటి పరిచయముందంటారు? అదేదో యింగ్లిష్ కథకో, రష్యన్ కథకో అనువాదమో అనుకరణో నని యితర రచయితలు వుత్తరం పడేసేదాకా తెలియనే తెలియదు. మంచి తెలుగే రాదిపలు నాకు.' అని విశాలంగా నవ్వాడు.

మోహిని మెడిసిన్ పూర్తిచేయటం మీద రిసెర్చ్ చేస్తున్న అభిమన్యుడి ఆలోచనలు దోణప్ప నవ్వుతో చెదిరిపోయినై.

'మిమ్మల్ని కలుసుకో గలిగినందుకు సంతోషం కలిగింది నేనిహ వెళ్తా' లేచినిలబడి పైజామా జేబులో చెయి పెట్టుకున్నాడు.

'వెళ్ళి పోవటానికా యింతదూరం వచ్చారూ? కూచోండి ముందు. మా అమ్మాయి రేపు మిమ్మల్ని వెంటబెట్టుకెళ్ళి నలు

గురికీ పరిచయం చేస్తుందీ. మీ కోరిక నెరవేరచ్చు' అన్నాడు దోణప్ప.

ఇదేదో సుగమంగానే తోచింది అభిమన్యుడికి.

## 5

మోహిని, నీలికళ్ళద్దాలలోంచి అతన్ని చూస్తూ కబుర్లు చెబుతూ కారు డ్రైవ్ చేసింది.

బహుమతి నిర్ణయ సంఘ సభ్యులతో బాటు బహుమతులు కొట్టిన వారినిగూడా పరిచయం చేసింది. వారి మాటలూ కబుర్లూ వింటుంటే, అభిమన్యుడు యేదో వ్యూహంలోకి పోతున్నట్టు తోచింది. వారిచ్చిన సాఫ్ట్ డ్రింక్సులాగా లేవు వారిమాటలు.

ఆ రాత్రికి, "అందర్నీ చూసి రావటంమైందిగా. నేనింక వెళ్ళచ్చా." అంటూ సూట్ కేస్ అందుకున్నాడు.

'చెప్పుల్లో కాళ్లు పెట్టుకుంటే పన్లవుతాయా? బహుమతీ వద్దా? అప్పుడప్పుడు చూసిరావద్దా?' అని దోణప్ప నవ్వుతుంటే అభిమన్యుడు సహనం కోల్పోయాడు.

'ఉద్యోగమూ, తల్లిదండ్రులనూ వదిలి మీ యింట్లో మకాంపెట్టాలా, మీ అమ్మాయి వెంట తిరగాలా?' అని బాణం యెక్కుపెట్టినట్టు చూశాడు.

దోణప్ప నవ్వునాపుకుంటూ, ఫస్టు ప్రైజుకోసం ఆమాత్రం త్యాగం చేయద్దూ? అన్నాడు.

కూతురు మోహిని తండ్రికి వత్తాసు పలికింది.

"రెండ్రోజులుండరూ? సిటీ అంతా చూపిస్తా."

సప్తమినాడు తన తల్లిదండ్రులను ద్రోణప్ప బంగళాలో చూసి అభిమన్యుడు తెల్లమొహం వేశాడు.

తల్లి, "దసరాకి కోవెలలకి రంగులేస్తారుట, చూసి పోదామని వచ్చాం" అన్నది.

అతనూహించని పెళ్ళిచూపుల తంతు జరిగింది. కాబోయే అత్తమామలను మెప్పించాలని, మోహిని బెనారస్ పట్టుచీరా రవికా ధరించింది. కొప్పుగొలుసు మిలమిల లాడిసై. ముక్కర తలలో కెంపులబిళ్ళ జిగేలుమన్నాయి. రవ్వలడ్డీగా, రాళ్ళ గాజులూ ధగధగలాడిసై. జడగంటలు ముందుకేసుకున్నది. అభిమన్యుడిమీద మోహనాస్త్రం వదిలింది.

"నినులినా నా మదెందు నిలువదేమి శ్రీహరి" అని పాడుతూ వీణ వాయిస్తూ వాలుచూపులు చూసింది.

అభిమన్యుడి కదంతా, సీట్లు పంచుకునే రాజకీయకుట్ర లాగా తోచింది. గురువు వీరందరికీ మద్దతు యిచ్చినట్టున్నాడు. సీట్లు పంచినట్టున్నాడు.

పెళ్ళితంతు యాంత్రికంగా చేస్తూ యేటో వేగంగా పోతున్నట్టు ఫీలయ్యాడభిమన్యుడు.

వధూవరులుగా తనూ మోహినీ మొక్కితే, గురువు,

"ద్రోణప్ప యిచ్చిన జాబ్ మంచిదోయ్, కాలేజీ జీతానికి రెట్టింపు ముడుతుంది. విదేశం వెళ్ళే అవకాశమున్నది. నీ తెలివి తేటలు రాణిస్తాయి."

నిలబడి చూస్తే, మామ ద్రోణప్ప, అభిమన్యుడి తండ్రిని వోదారుస్తూ కంట బడ్డాడు.

'మీ అబ్బాయి మిమ్మల్ని వచ్చి చూసి పోతూవుంటాడు నాదేమున్నది. పేరునాది గాని పూరు మీ అబ్బాయిదే "

తండ్రి తల దన్నిండి మోహిని పడగ్గదిలో ఒంటరిగా అతన్ని చేజిక్కించుకుని, కాటుక కంటినీరు గుండ్రని బుగ్గల మీద కారుస్తూ, వెచ్చని మెత్తని అరచేతులతో అభిమన్యుడి పాదాలు తాకి,

'మా నాన్నను క్షమించరూ? తెలివితక్కువదాన్ని నన్ను మీకంట గట్టాడు' అన్నది.

## 6

'పద్మ' పత్రికా ఆఫీసులో ముఖ్యసంపాదకుడిగా కుర్చీలో కూచున్న అభిమన్యుడికి, మురిసేందుకు జీతంతప్పితే యింకేం కనపడలా, తమవూరిలో జూనియర్ కాలేజీలో, కాలేజీ మాగజైన్ సంపాదకుడిగా వున్నప్పుడు తనకున్న అధికారంలో సహస్రాంశంగూడా లేదిప్పుడు. విశ్వాసరావు అనే అసోసియేట్ ఎడిటర్ సైంధవుడు లాగా తోచాడు.

విశ్వాసరావు స్వంత పత్రిక పెట్టుకున్నాడు. దానికి నడకరాక నిలబడిపోయింది. ఇతర కొత్తపత్రికా ఆఫీసుల్లో దూరి, అవీ ఆగిపోవటం, వాటికెకారణాలు గ్రహించిన శూరుడు.

ద్రోణప్పకి వ్యాపారం చేయటంలో కిటుకులు తెలిసినంత బాగా, సాహిత్య విలువలు తెలివని గ్రాహించాడు. తక్కువ జీతంతో "పద్మ" ఆఫీసులోకి జొరబడ్డాడు. రత్న పరీక్షకుడల్లే కథానికలకీ, నవలలకీ విలువకట్టి "పద్మ" లో పడ్డేట్టు చూస్తూ పత్రిక సర్క్యులేషన్ పెరిగిందని చూపాడు.

డిగ్రీ వున్నవాడు, సాహిత్యవిలువ తెలిసినవాడూ ఆఫీసులో తిష్ఠవేసేప్పటికి విశ్వాసరావుకి జెలసీ కలిగింది. అభిమన్యుడు ద్రోణప్ప అల్లుడు గనక, కొండతో ఢీ కొన్నట్టే. లౌక్యం అప్లై చేశాడు. స్నేహంగా వుంటూనే పెరుస్తున్నట్టు కనబడుతూనే అడ్డుపుల్ల వేస్తాడు. ప్రపంచ శాంతిని కాపాడే కిస్సింజరు మహాశయునిలాగా అందర్నీ కూడగట్టు కొస్తున్నానంటాడు.

అభిమన్యుడు సెలెక్టుచేసి ప్రెస్‌కి పంపబోతున్న కథలను చూసి,

"కొత్తగా వచ్చిన మీకు, యేది ముందు పంపాలో యేది తరవాత పంపాలో తెలుసుకుంటారా? ఇదేం కాలేజీ మాగజైనా?" వెటకారం చేశాడు.

అభిమన్యుడు కైజారు చూపులు చూశాడు.

"అయితే నేను చిన్నా మెసాయంతో డిగ్రీ తెచ్చుకుని లెక్చరర్ని అయి, యెడటర్ని అయానంటారా?" అన్నాడు.

'అదుగో చూశారా, మీకింకా చిన్నతనం వదల్లా. ఆవేశ పడితే నేచేప్పే దసలే అర్ధంగాదు. మీ మెప్పుపొందిన కథ వేయటానికి అర్జంటెందుకూ? మంచి సాహిత్యం వెలువరించానా, పాఠకులన్నీ చదువుతారంటారా. యెయిర్‌పోర్టులోనూ, రైలు పెట్టిలోనూ వదిలేసి వెళ్ళిపోతారు.' ఠాని నవ్వు నవ్వాడు.

'తన రచనమీద గొప్ప నమ్మకముంచుకుని పత్రికలో పడుతుందని యెదురు తెన్నులు చూసే రచయితను, పీల్లైన న్నాళ్ళు యేడిపించమంటారు.' వేడిగా వాడిగా అన్నాడభిమన్యుడు.

అతని తీవ్రవాదానికి విశ్వాసరావింకా నిదానంగా జవాబిచ్చాడు.

"అబ్బెబ్బే! నేనలా అనటంలేదు. తరుచూ మన దర్శనం చేసుకుంటూ, మన్ని సంతోషపెట్టే వాళ్ళను చిన్నబుచ్చి, వాళ్ల రచనలు బుట్టదాఖల్ చేయటం భావ్యమా అంటున్నా."

అభిమన్యుడికి తన విలువైన సాహిత్యం గంగలో యెందుకు కలిసిందో తెలిసిపోయింది కంట్రోల్ చేసుకోలేక పైకనేశాడు.

"అయితే నేనిహ దీపావళి కథలపోటీకి రాయక్కర్లేదు." బల్లమీద చేతులాన్చి తల పట్టుకున్నాడు.

విశ్వాసరావు యెదురుగా వచ్చి చేతులాడిస్తూ అన్నాడు. "అప్పుడెలాగా మీకిహ బహుమతి యివ్వరు. రంభవంటి కూతుర్ని, కట్నాన్ని పైవాడికి కట్టబెట్టడమేగాక బహుమతి సొమ్ము అనే మిషతో వేలరూపాయలూ వాడికే అందేట్టు చూస్తున్నాడు దోణప్ప. అని యెడిటోరియల్ స్టాఫ్, కమిటీవారు పబ్లిసిటీ ఆఫీసరూ అన్నారుట." మళ్లా తాను మంచివాడినే అని నమ్మించాలని, బల్లమీద ఆని ముందుకు వంగి అన్నాడు విశ్వాసరావు.

"పత్రిక తనదిగదా, దోణప్ప వీరందరికీ యెందుకు వెరవాలీ?"

అభిమన్యుడు గుండెమీద గదా ఘాతం తాకినట్టయింది. ఒక్క ఆయుధమూ చేతిలో లేనట్టు తోచింది. పారిపోయినాడు. ధైర్యం సడలిపోక మళ్లా ఆవరించింది. మొహం యెర్రనైంది, అతని వుత్తమ రచనలు బుట్టదాఖలైతే, ఉత్తమాశయం పట్టీలో కలిసింది.

'పరధనముల కాసపడక' అనే పద్యం నేర్పిన తండ్రి, 'బిడ్డనమ్ముకుంటామా?' అంటూ సంబంధాలు తిప్పేసిన తల్లి యెంత పని చేశారూ? తాను తెలివితక్కువాడే! ఈ వ్యూహం మధ్యలో కొచ్చేశాడు.

సాయంకాలమైంది. ఆఫీసు మూసే వేళ అయింది. విశ్వాసరావూ, కుర్రాడూ అన్నీ సద్దేస్తున్నారు.

చెంగలువపూవు రంగులో వున్న సూర్యుడు, మబ్బు పైనించి చూస్తు, కొబ్బరాకుల సందునించి, చల్లని కిరణాలు పంపుతున్నాడు. ఆ నీరెండ, వుద్రేకం చల్లారి పోతున్న అభిమన్యుడి మొహంమీద పడింది. బల్లమీద ఫోన్ మోగింది. అభిమన్యుడు యాంత్రికంగా అందుకున్నాడు. మోహిని కంఠం ముద్దుగా గోముగా వినవచ్చింది.

"మీరేనా?"

"నే నే."

'దసరా గ్రీటింగ్సు యిచ్చుకోవాలి, పొద్దున వచ్చిన ఇన్విటేషన్ మీకు చూపాను. టాక్సీలో వెళ్ళనా?'

'అయ్యో! యెందుకూ? నీ బాడీగార్డుకు కారు తోలటం నేర్పించింది. నువ్వు టాక్సీలో వెళ్ళటానికా? విశ్వాసరావుగారు లోకజ్ఞానం కలిగిస్తుంటే వింటూ నీ సంగతి మరిచా, సారీ బండి తెచ్చేస్తున్నా, డ్రైవరుగా నన్నా పనికి వస్తానేమో చూడాలి.'

అవతలినించి నవ్వు వినవస్తుంటే, అభిమన్యుడు రిసీవర్ క్రేడిల్లో వుంచాడు.

అంత కోపమైతే యెలా నెగ్గుకొస్తా వన్నట్టు విశ్వాసరావు నవ్వుతుంటే, అభిమన్యుడు గుడీవినింగ్ చెప్పాడు.

## 7

మహానవమి పేరంటాళ్లు లోపలికెళ్తున్నారు. పక్కగా వున్న పెద్దగదిలో సోఫాలో అభిమన్యుడిని కూచోబెట్టి మోహిని లోపలికెళ్ళింది.

గదిలో కమిటీ మెంబర్లూ, వారిలో పెద్ద అయిన కేశవరావు మరో యిద్దరు పెద్దమనుషులూ సుఖాసీనులై వున్నారు వాళ్లేదో మాట్లాడుకుంటూ అభిమన్యుడిని చూసి ఆపారు. మళ్లా అందుకున్నారు.

అభిమన్యుడు యెదురుగా బల్లమీదున్న 'లుక్' అనే ఇంగ్లీష్ జర్నల్ అందుకున్నాడు. అతనికోసం ఫలహారం వచ్చింది. కేశవరావు, మాట్లాడుతూనే 'తీసుకోండీ' అన్నాడు.

వాళ్ళేం మాట్లాడుతున్నారో అభిమన్యునికి అంతుబట్టలా. గ్రీసు దేశంలో జనాభా పడిపోయినప్పుడు గ్రీసు దేశీయు లేం జేసేవారో చదువుతూ నవ్వుకుంటున్నాడు.

అభిమన్యుడి పరపన వున్నాయనంటున్నాడు.

"మీ అబ్బాయి బాగానే చదువుతున్నాడట. ఫస్ట్‌క్లాస్ వస్తుందిట. వచ్చేయేడు రిసెర్చ్‌కి స్కాలర్‌షిప్ వస్తుందిట, నా ఫ్రెండ్ ప్రొఫెసరుగారు చెప్పారు."

'యేమో యేం ఫస్ట్‌క్లాసో, వాడసలు క్లాసులో మొహం చూపించటం లేదని చూసిరానా అనుకున్నా. ఈమేహ నెప్పుల తో వెళ్ళలేక పోయినా. దేముడల్లే చారందారు.'

'మీకా శ్రమలేకుండా వేశా' అంటూ ఆయన తన జేబు లోంచి కవరు తీసి కేశవరావుగారి కిచ్చాడు. గదిలో బార్‌లైట్ల వెలుగులో, కేశవరావుగారు, కవరు జాగర్తగా పూడదీశారు. ఒక కాగితం యెదురుగా బల్లమీదుంచి చూస్తున్నాడు. అక్కడే ఫలహారం ప్లేటున్నది. అభిమన్యుడు వంగి లడ్డూ అందుకున్నాడు. పుత్తరంలోని రెండుపంక్తులతని కంటబడినై.

"ఈ యేడన్నా మాఅమ్మాయి బహుమతి తెచ్చుకోగలిగినందుకు సంతోషం కలిగింది. పెద్దమనుషులవల్ల మీకొకావాల్సిన విషయాలు వినగలరు." కాగితాలు కవరులో దూరి కేశవరావుగారి జేబులో కెళ్ళినై.

అభిమన్యుడి రోమాలు నిక్కబొడుచుకున్నాయి పుత్తరం మొత్తం చదవాలనిపించింది.

రెండో పెద్దమనిషి, తీపివున్న పెట్టె బల్లమీదుంచుతూ చల్లగా నవ్వాడు, మొదటాయన అన్నాడు.

'వీరు మనఫ్రెండ్, వీరిసంగతే మీతో మనవి చేస్తు వచ్చాను.' ఆయనా నవ్వు చిందించాడు.

'యేమిటిది' అంటూ కేశవరావు పెట్టెమూత తీశాడు. వెండి రేకు కప్పివున్నట్టు తీపిపుక్కలూ, వాటి మధ్య గులాబిరంగు కాగితపు పువ్వు వుండటం అభిమన్యుడు క్రీగంట చూశాడు.

దసరాగదండీ! పెద్దలవద్దకు వట్టిచేతులతో రాకూడదని వో కేజీ కలాకందు తెచ్చాను. అని చేతులు నలుపుకున్నాడు.

"విశాలం సంగతి దేణప్పతో సంప్రదిస్తే లాభిస్తుంది." అన్నాడు కేశవరావు. కళ్ళు యేదో చెప్పినై.

'అటునుంచే వచ్చాం, వారు వూళ్లోలేరు. వారిని మళ్ళా దర్శించుకుంటాము.' ఇంకా చెప్పాల్సింది వున్నట్టు చూచాడాయన.

'చెప్పండి' అన్నాడు కేశవరావు.

మావాడు, యెమ్మె ఫెయిలప్పటినించీ, పిచ్చివాడై పోయాడు వాడి స్నేహితులూ, హితైషులూ, వాడిని సాహితీ సమితిలో చేర్చి, కథానికలూ, నవలికలూ, వ్రాయిస్తూ యీ ప్రపంచంలోకి తెచ్చారు. వాడు, 'పద్మ' చదవటం మొదలెట్టి, మంచి సాహిత్యం పడుతున్నాదని గమనించి, అయిదేళ్ల కొక్కసారే చందా కట్టేశాడు. నా ప్రోహంమీద యీయేడు యేజన్సీ తీసుకుని, చందాదారుల్ని చేర్పించాడు. అని నవ్వుతున్నాడు. శ్రోత తల వూపుతున్నాడు.

"మీ అబ్బాయి నిరసమా?" యేదో గుర్తు వచ్చినట్టు అడిగాడు కేశవరావుగారు.

'కాదు. ఆ సంఘం లేనిపోని ఆపదలు తెచ్చిపెడుతుందని ముందే గ్రహించి అభ్యుదయ రచయితల సంఘంలో చేరాడు మా అబ్బాయి. అభ్యుదయ రచనలే చేస్తాడు.'

మేము అనుకరణలూ, అనుసరణలూ అంగీకరించం.

'మావాడికా భాషలే సరిగారావు, మౌలికరచనలే చేస్తాడు. వచనగేయం కూడా స్వంత ఆలోచనే.'

అభిమన్యుడు మౌలికమైన వూహసాగిస్తుండగా మోహిని వచ్చి రమ్మని పిలిచింది.

## 8

ఎడిటోరియల్ స్టాఫ్‌లో ఒకరిద్దరు సుస్తీ అని శలవు మీదున్నారు. మరిద్దరు ప్రెస్‌కివెళ్లాల్సిన బొత్తిని తయారుచేస్తున్నారు. కార్టూన్లు, రెవ్యూలు, పజిల్సు, యివి మీకు తెలుసా అనేవి సెలెక్టు చేస్తున్నాడాఫీసులో, అభిమన్యుడు యడ్వర్‌టైజ్ మెంట్సు చూస్తూ బల్లముందున్నాడు. డ్రాయరుమీద నాలుగైదు బొత్తుల వ్రాతప్రతులున్నాయి.

ఒకమ్మాయి వచ్చింది, తలెత్తిచూసి 'కూచోండి' అన్నాడు మోడరన్ వుమన్‌లాగా వున్నది. నవ్వుతూ అడిగింది.

'నారచన అంగీకరించారని తెలిసింది, ప్రెస్‌కి వెళ్ళిందా?'

ఇవన్నీ ప్రెస్‌కివెళ్ళేవే, వరుసక్రమంలో పంపబడతాయి గాస్ సిలిండర్స్ వెళ్తాయి చూడండి. అలా అన్నమాట, యేజెంటు మీకాల్ని నోట్‌చేసుకుంటాడు. పొద్దుటినుంచీ ఫోన్ మోగుతూనే వుంటుంది. యెవరికన్నా ముందు పంపితే నేరమౌతుంది. పక్షపాత మంటారు.

ఆ యువతి నవ్వుతూనే అడిగింది. కొంతమంది తామేస్వయంగా వెళ్ళి అర్జంటుగా సిలిండరు తెచ్చుకుంటారే.

మీరా పద్ధతి అప్లై చేసి చూడండి. అక్కడింకా బొత్తులుం టాయి. మీది పుట్టింటికొస్తుంది, ఇక్కడినించైతే యేనాడన్నా ష్యూర్‌గా ప్రెస్‌కి వెళ్ళగలుగుతుంది.

'మళ్ళా వస్తా' నంటూ నవ్వుతూనే వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవేపే చూసి మళ్ళా పనిలో మునిగాడు.

మరొక స్త్రీ వచ్చింది. టీచరు మేకప్.

"కూచోండి" అన్నాడు అభిమన్యుడు.

నాగేయం పంపారా ప్రెస్‌కి, సెలపైనే అయిందండి ఆఫీసులో యిచ్చిపోయి. మేనజరుగార్ని చూసొచ్చా. అన్నది.

అభిమన్యుడు వ్రాతప్రతులుకెవికి ఆమె గేయ రచన కాగితాలు తీశాడు, రచనేమో మౌలికమే. నడకమాత్రం అను కరణ. "యే యువతి చరిత్రచూసినా యేమున్నది గర్వకార ణం?" మగజాతి చరిత్ర చెప్పును స్త్రీజాతిని కాల్చుకు తినటం. ప్రేమొకచోటా, పెళ్ళొకచోటా, మాటలు వేరూ చేతలు వేరూ, అలానడించిది.

నేనడిగే రెండుమూడు ప్రశ్నలకి జవాబు లివ్వండి. ఇప్పుడే మీరు చూస్తుండగా మీ రచన ప్రెస్‌కి పంపుతా, అన్నాడభిమన్యుడు.

తలూపిందా టీచరమ్మాయి.

"పాశ్చర్‌నాక్ రచించిన నవల పేరేమిటి? గిలగ్ అర్కి పెలగో రచించిన రచయిత పేరు ప్రొవేన్స్ చేయండి రాజశేఖర చరిత్ర మౌలికమేనా? ఉన్నవ లక్ష్మీనారాయణ గారి లైఫ్‌వర్క్ పేరేమిటి? అది తేలిగ్గా పబ్లిష్ అయిందా. సబో జ్ యెవరన్నా పబ్లిష్ కాకుండా చూశారనుకోండి. ఏమిటి కారణం?"

మారుమాట లేకుండా టీచరు లేచి కళ్ళు వుత్తుకుంటూ నిష్క్రమించింది.

నమస్కారం! చాలా బిజీగా వున్నారే, నేను వచ్చి పది నిమిషాలయింది. అన్నదో నడివయస్కురాలు.

"సారీ, కూచోండి. చదివి సెలెక్టుచేయాల్సిన రచనలు చాలా వున్నాయి. మీరే వచ్చారే, ప్రొఫెసరుగార్నే పంపక పోయారూ?" అన్నాడు.

నా రచనలు పడటంలేదు, చూసి పోదామని వచ్చాను. స్టయిల్ మార్చాలా? అన్నది నవ్వుతూ.

"ఆ, మారిస్తే పడచ్చు, కొత్త హీరోయిన్లు తెరమీద తీలుతున్నట్టు ఫిమేల్ రచనలు కొల్లలుగా వస్తున్నాయి. పాతివ్రత్యం, నిజాయితీ, ప్రేమా అంటూ రాసుకుపోతున్నారు. బైబిల్ కథల్లాగా, భక్తవిజయం లాగా వుంటున్నాయి. అందుకని బూతులు, రంకులు చొప్పించి రంజుగా, పతితుల, భ్రష్టులస్టోరీస్ కంపోజ్ చేయాలిట అని ప్రొఫెసరుగారితో చెప్పండి.

పడతాయి. పత్రిక సర్క్యులేషన్ పెరుగుతుందిట అని తెలియజెప్పండి. ఇంక చాతనైతే హారర్ కథానికలు వ్రాయమని చెప్పండి." అన్నాడు.

ఆ నడివయసుక్కారాలు పకపకా నవ్వింది.

"కొంతవరకైనా నిజం చెప్పారు థాంక్స్." అనిలేచింది.

నా టెటాల్, అన్నాడభిమన్యుడు. 'చందా కట్టండి'

భోజనం వేళ్టికి విశ్వాసరావు వచ్చాడు ఆఫీసులోకి బల్ల దగ్గరకి వచ్చి అన్నాడు.

"అదేమిటండీ? ఇవాళ అంతమందిని యేడిపించి తరిమేశారూ, అందునా స్త్రీలనే"

"నాకు నచ్చిన సాహిత్యం యెలాగో పడుతుందంటిరి. అణిచిపెడుతున్నా. మీరెందుకొచ్చారూ? వాళ్ళు ఆడవాళ్ళు. నన్ను చూడాలని వస్తున్నారేమో, మీకు తెలిసినవాళ్ళ రచన ప్రెస్‌కి పంపాలా? యేదీ?" అన్నాడు.

విశ్వాసరావు మొహం మాడ్చుకుని వెళ్ళిపోయినాడు.

## 9

మోహిని మేడమీది గదిలో నిద్రబోతున్నది. డౌనుస్టెయిర్స్ గదిలో టేబిల్‌మీద, మేలిముసుగున్న దీపం వెలుగుతున్నది. గది తలుపులు మూసివున్నై. అభిమన్యుడు దీపంముందు తలవట్టుకుని కూచుని వున్నాడు.

అరగంట నించీ మామా అల్లుడు వాగ్యుద్ధం చేస్తున్నారు. అభిమన్యుడో నవల తిప్పేశాడు. ఆ నవల వచ్చేవారం నించీ సీరియల్‌గా వేయిస్తామని, రచయితకు ఫోన్‌చేసి, సారీ చెప్ప మంటాడు మామ.

ఆయన తనపక్కగా పచార్లు చేస్తూ, చేతులు వెనక్కు వుంచుకుని, అప్పుడప్పుడు తనవేపు ఓ చూపు విసురుతుంటే అక లిగొన్న పులిలాగా వున్నాడతని ప్రాణానికి. పంజాలో గోళ్ళు బయటికొచ్చినట్టు భ్రమ కలిగింది.

"ఇంత వెర్రివాడి వనుకోలేదు. పూర్ణయ్య నిన్ను అమా యకుడు అన్నాడుగాని, నీది అమాయకత్వంగాదు. అమాయ కులవల్ల యెన్నడూ హానిజరగదు"

అభిమన్యుడాశ్చర్య పోయాడు.

"నావల్ల మీకేం హాని జరిగిందీ."

ఇంకా యేంజరగాలీ, నా పరువు తీసేశావు నన్ను కన్సల్ట్ చేయకుండా, పెద్దమనిషి నవల రిటరన్ చేశావు.

'మీకు తెలుగే సరిగా రాదంటిరి, సాహిత్యరంగంలో అను భవం లేదంటిరి, ఆ నవలలో యేమి చెప్పారు? అసలు నవలా అది? హీరో వున్నాడా అందులో, అతడెటువంటి నాయకుడు? ధీరవుదాత్తుడా? ధీరలలితుడా? దక్షిణ నాయకుడా? నామిత్రు డి నవల మీరు తిప్పి పంపేయించలేదూ? నాతో సంప్రతించారా?'

నీ మిత్రుడి నవల 'సెవెన్ మినిట్స్' కి అనుకరణ దాన్నిండా వచ్చి శృంగారమూ, కమ్యూనిజమూనూ, పాఠకులు సంచలనం లేవదీస్తారు.

అభిమన్యుడు లేచి నిటారుగా నిలబడ్డాడు. మామ ను చీలుస్తున్నట్టు చూశాడు. అన్యాయాన్ని యెదిరించాలి.

"సెవెన్ మినిట్సు రచయిత యెవరు? ఆయన తక్కిన రచన లేమిటి. యెన్ని అమ్ముడు బోయాయి?"

మామగారు జవాబివ్వ లేదు, పచార్లు సాగించాడు.

'విశ్వాసరావు మాటలు నమ్మి తిప్పేశారు, నా మిత్రుడు మౌలిక రచన చేశాడు. దేశ పరిస్థితి, కాలము సాంఘిక విష యాలు సైన్సు యిన్ని వున్నాయందులో. హీరోది యెంత గంభీరమైన స్వభావం? యెడిటర్‌గా నాకేం అధికారం లేదా?'

అసలు నీకు చీఫ్ యెడిటరంటే అర్థంతెలుసా? అధికారమా యెందుకు లేదూ? పత్రికనూ నన్నూ కనిబెట్టివుండే వాళ్ళందరి తో వైరం పెట్టుకోటానికి కావాల్సినంత అధికారమున్నది.

ద్రోణప్ప నిలబడి, ఫోన్‌చేసి సారీ చెప్పక తప్పదంటుంటే, అభిమన్యుడికి తనను నిరాయుధుడిని చేసి, ఆయుధంతో మీదికొ స్తున్న అతిరథుడైన గురువులాగా కనిపించాడు, మామ. తాను సాహిత్యం విలువ ఆయన బుర్రలోకి డ్రైవ్‌చేయాలని చూస్తుం టే, ద్రోణప్ప లావాదేవీలు యెత్తాడు. చేయకతప్పేట్టు లేదుగనుక అభిమన్యుడు చచ్చినట్టు, మామ ఆజ్ఞ ప్రకారం చేశాడు.

మామ సంతోషించాడు. పేపర్ కోటా వచ్చేసింది, అభి మన్యుడి వంక చిన్న పిల్లాడి చేత చేదుమందు మింగించి, నీ మంచికే అన్నట్టు చూశాడు. నవ్వు మొహంతో పోబోతున్నాడు.

'నీ స్నేహితుడు డబ్బు యిబ్బందిలో వున్నాడేమో నీ నవల కోల్డ్‌స్టోర్‌లో వున్నది. వెతికిస్తాను, అని చెప్పు. నవల కన బడకపోతే డబ్బు చెల్లిస్తారు పత్రికాధిపతులు అని చెప్పుకో.'

మామ వెళ్ళేవేపే చూశాడు అభిమన్యుడు.

'నవల పోటీకి పంపాడు, బహుమతికి వొక్కసారన్నా న్యాయం చేకూరాలి' అన్నాడు.

వాకిలి తీసి పోబోతున్న మామ వెనక్కుచూసి, నాక్కన పడమను. అన్నాడు.

'నే కనిపించాగా, వాడికి పెళ్ళి అయింది, మీకింకో కూతు రు లేదు.' అన్నాడు కసిగా.

దోణప్ప 'కసి బోనమ్మ మసిబూసుకున్నదిట' అని అందం గా నవ్వి వెళ్ళిపోయాడు.

భోజనం వేళ దాటిపోయింది, అభిమన్యుడు తానిక్కడికి వచ్చి బావుకున్నదీ లేదు చేయగలిగిందీ లేదని తెలుసుకుని తల పట్టుకూర్చున్నాడు.

మోహిని నిద్రకళ్ళతో వచ్చింది. అతనిమీదికి వంగి, "భోజనానికి రారూ?" అని చెంప అనించింది.

మీ నాన్న నాచేత చేయించిన పనికే కడుపు నిండింది. ఆకలి లేదు. అని కౌగిట్లోకి తీసుకున్నాడు.

"యెందుకండీ అంత కోపం? మా నాన్నను వాడుకోటమే చాత గావాలిగానీ యేదడిగినా యిస్తాడు." అన్నది చేతులతని చుట్టూ వేస్తూ.

'ప్రైజు మినహా' అన్నడభిమన్యుడు.

మీరంటే మానాన్న కెంతో ప్రేమా గౌరవమూనూ, మీ కోసం పెద్దవిందు యివ్వబోతున్నాడు, అంటూ అతన్ని లేవ దీసింది.

తనకు మనుమడు కలగ బోతున్నాడనీ, 'పద్మ' అభివృద్ధికి కొత్తపద్ధతులు తెలుసుకు రావటానికి, కూతురూ అల్లుడూ విదేశం వెళ్ళబోతున్నారనీ, పత్రిక సర్క్యులేషన్ పెరిగిందనీ, ప్రవాసాంధ్రులుకూడా, చందా దారులు కావటమేగాక, యేజన్సీ గూడా తీసుకుంటున్నారనీ, 'పద్మ' హిందీలో గూడా వెలువడ బోతున్నదనీ చెపుతూ, దోణప్ప విందుకి ఆహ్వానాలు పంపాడు.

సాహిత్య ప్రియులు, పొలిటీషియన్సు, కళోపాసకులు ప్రెస్ విలేఖరులు, ఎడి యిచ్చేవారు, లైఫ్ సబ్‌స్క్రైబర్స్ పోలీస్‌శాఖ, కొద్దిమంది విదేశీయులు, విందుకు హాజరైనారు.

దోణప్ప తన అల్లుడిని పరిచయం చేశాడు.

బార్‌లైట్ల వెలుగులో బంగ్లా పాలసముద్రమల్లే, అతిధులు దేవదానవులల్లే తోచారభిమన్యుడికి. విదేశీయులు సుర సేవిస్తూ అభిమన్యుడిని గూడా పాల్గొనమన్నారు. సభ్యత చూపాలని, రాను అనలేక పోయాడభిమన్యుడు. సేవిస్తున్నప్పుడు బాగానేవున్నది. వళ్ళు వేడెక్కుతున్నది. నాలుక పదునెక్కుతున్నది.

రచయితలు, ప్రైజులుకొట్టిన హేమాహేమీలు, అభిమన్యుని లాక్కెళ్లారు, విందు మొదలైంది. తమ ప్రతాపం చెపుతూ భోజనం కానిస్తున్నారు. అశువుగా, కథానికలు వ్రాసేస్తారుట. సాపే తీయరుట, అభిమన్యుడి తలతిరుగుతున్నది. వాళ్ళవాగుడు వింటుంటే వాంతి అయేట్టున్నది. పచ్చి అబద్ధాలు, ప్లాగరిజమ్

"ఔను, పాయింటు వేరే భాషలోది తీసుకుంటే, బ్రహ్మ దేవుడు కొట్టుకోక్కర్లేదు. నల్గేరుమీద బండి పోయినట్టువ్రాసేయచ్చు సినిమాలూ అంతే, తాను చదివిన కథానికలలోని పాయింటు, నవలలోని వస్తువు, యెక్కడనుంచి చౌర్యంచేసి వ్రాశారో చెపుతూ, పత్రికల పేరూ చెప్పసాగాడు."

అనాగరకుడు, సభ్యతలేదు అభిమన్యుడికి అన్నారు. ఊరుకోక అతన్ని యెద్దేవా చేశారు.

'అభిమన్యూ! నీవి మౌలిక రచనలేగా, ప్రైజు కొట్టలేక పోయా వేం?' అని పొడిచారు బుగ్గలమీద, మోచేత్తో నెట్టారు.

అది తెలుసుకోటానికే వచ్చానిక్కడికి, నన్నిక్కడిరికించారు. వ్యూహంలోకి వచ్చా, పోతానేమో, వాంతి అవుతుంటే ఆపుకుంటూ లేచిపోయాడమన్యుడు.

## 10

అభిమన్యుడు తన బెడ్‌రూమ్‌లో, సోఫాలో జారగిలబడి, కాళ్ళుజాపి, చేతులు వేలాడేసి, తల వాల్చేశాడు. తిన్నదంతా వెళ్ళిపోయినా, కడుపులో తిప్పుతూనే వున్నది. తల గిర్రున తిరుగుతున్నది. కళ్లుదెరిస్తే రూమంతా వూగుతున్నట్టున్నది. యెదురుగా గోడలకున్న పఠాలమీద దృష్టి పడింది. ఒక్కొక్కటే చూస్తున్నాడు. గంగాశంతనులు, సప్తకన్యలు, మేనక విశ్వామిత్రుడు శకుంతల వేడికోలుగా చూస్తుంటే విశ్వామిత్రుడు మొహానికి చేయి అడ్డం పెట్టుకున్నారు, కృష్ణ రాయబారం, అమృత మథనం.

చివరి చిత్రమే చూస్తున్నాడు. దేవదానవులు, పాల సముద్రం చిలుకుతూ ఆయాసపడుతున్నారు. చూస్తుండగానే పాలసముద్రం నుండి కల్పవృక్షమంటి "పద్మ" పుట్టింది. సాయంపట్టి నేలమీద వుంచగానే శాఖోపశాఖలేసింది. కొమ్మల మీదికి లెక్కలేనంతమంది పాకి యెక్కి కూచున్నారు. కవులూ గాయకులూ, రచయితలూ, సాహిత్య పిపాసువులూ, తినతిండి కోసం కల్పవృక్షాన్ని యాచిస్తున్నారు. 'పద్మ' వారికి తాహతును బట్టి భృతి కల్పించింది.

మళ్ళా మధించగా అమృతం పుట్టింది. మోహిని నవ్వుతూ అమృతకలశం అందుకున్నది. శాఖలమీద వరుసలు తీరివున్న సాహిత్య ఆరాధకులు వెర్రి ఆశతో చూస్తుండగా, మో హి ని ప్రత్యేకించి ఒక శాఖమీదున్న వారికి అమృతం పంచుతున్నది. ఆ కొమ్మమీదున్న వారి కిరీటాలన్నీ ఒకే నమూనాలో వున్నాయి. కట్టూ బొట్టూ జుట్టూ ఒకే పోలిక. మొ హా న విజయ గర్వం.

తమకూ్కడా తాగే హక్కున్నదనీ, అమృత మథనంలో తామేమీ తక్కువ శ్రమించలేదనీ, తనూ తన మిత్రుడూ చెప్పుకోవాలని లేచివెళ్లారు. మోహిని వీరివేపన్నా చూడలేదు తామిద్దరూ నేర్పుగా అదే శాఖమీదికి పాకి రెమ్మలుపట్టుకు చూస్తు మోహిని తమవద్దకు రాగానే దోసిలిపట్టి అ మృ త ం తాగాలి. మోహిని చిద్విలాసంగా నవ్వుతున్నది. పంచుతూనే వున్నది. తమవేపు వస్తుందా? అంత మెల్లిగా పోస్తున్నదేం?

కుదిలింపుకి అభిమన్యుడికి తెలివివచ్చింది. మో హ ని, కలవరిస్తున్నారు. పార్టీలో యెక్కడా కానరాలేదు. వెతికి వెతికి బెడ్‌రూమ్‌కి వచ్చా అంటున్నది. కళ్ళనీళ్లు చెంపలమీద జారుతున్నాయి.

అభిమన్యుడు లేచి కూచున్నాడు. మొహమంతా చెమట పట్టింది. మొహాన తడిసిన జుట్టు పడింది. షర్టూ బనీయనూ తడిసిపై.

మోహిని, వేడినీళ్ళలో గుడ్డముంచి పిండి తుడుస్తున్నది. పొడి తువాలుతో తుడుస్తున్నది. మొహంమీది జుట్టు పైకి నెట్టేస్తున్నది. షర్టు గుండీలు విడదీస్తున్నది.

"మానాన్నను అడుగుతా, మీకునచ్చిన కథానికకు నవలకూ యెందుకు ప్రైజుయివ్వరో అడుగుతా. న్యాయం మీరు యెన్నిక చేసిన రచనకిద్దురుగాని, మీ విలువ మా నాన్నకు తెలియజెపుతా." అని యేడుస్తున్నది.

గుడ్డలు మార్చుకోవాలి, లేచిరారూ? పాంటునిండా మరకలైనై. మంచి గుడ్డలు వేసుకోవాలి, లేచిరారూ. మా నాన్నను వంచుతా. లేచిరండి అని చుట్టు చేతిలేసి మొహానికి మొహమానించింది.

అభిమన్యుడికి బాగా తెలివి వచ్చింది. చుట్టు చేతులేసి హత్తుకుంటే కౌకిలినిండి పోయింది మోహినితో. నవ్వుతూ చూచాడు.

"అంతే, అంతే. నన్ను నీ ద్వారా వంచినట్టే, నేను నిన్ను అడ్డముంచుకుని యుద్ధం చేయాలన్నమాట" అన్నాడు.